# నేహాల



సాయిబ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత  సంచిక నుంచీ తరువాయి)

## 18

**సుల్తాన్ ఫిరోజ్ షాకీ, అహ్మద్‌ఖాన్‌కీ, గిసుదరాజుకీ** వంగి సలాం చేసాడు మాసూం. ఒక్క అహ్మద్‌ఖాన్ తప్ప అతనికి మిగతా ఎవరూ పరిచయం లేదు. సుల్తాన్ పేరు వినడమే కానీ ఎప్పుడూ చూసే అవకాశమే రాలేదు. మాసూంని ఎగదిగా చూశాడు గిసుదరాజ్.

"నీ పేరు? ఎక్కడుంటావు?" గిసుదరాజే మొదటి ప్రశ్న వేసాడు.

మసూం తన గురించి చెప్పాడు.

"విజయనగర రాజులు మాపై యుద్ధానికి వస్తున్నారన్నది రూఢిగా చెప్పగలవా? లేక గాలి వార్తా?"  ఫిరోజుషా అడిగాడు.

"గాలివార్త కాదు సుల్తాన్! నేను వారం క్రితం విజయనగరం వెళ్ళి వచ్చాను. ఈ సారి గుల్బర్గాని

ఆక్రమించుకోవాలంటే ఉత్తరం వైపు నుండీ, దక్షిణం వైపునుండీ ఒకేసారి చుట్టుముట్టలని వారి పథకం అనుకుంటాను. దాదాపు అయిదువందలమంది సైన్యాన్ని ముద్గల్ మీదుగా లింగసిగూరు వైపు తరలిస్తున్నారు. కావాలంటే మీరు వేరెవరి ద్వారానయినా కనుక్కోవచ్చు. నేనూ ముద్గల్ వైపుగా వెళ్ళి విషయం తెలుసుకునే వచ్చాను. సుల్తాన్‌కి చెప్పి ముందుగా అప్రమత్తం చేయడానికే వచ్చాను." అంటూ వివరంగా చెప్పాడు.

"ఇతనొక్కడే కాదు. వేరే వేగులుగా కూడా సైన్యాన్ని ముద్గల్ వైపుగా తరలించినట్లు వార్త తెచ్చారు. మసూం తీసుకొచ్చిన వార్తలేవీ ఇంతవరకూ తప్పు కాలేదు. అయినా మన జాగ్రత్తలో మనం వుండాలి.

వీలయితే యుద్ధానికి వెనుకాడకూడదు. ఈసారి ఎలాగయినా  దేవరాయల్ని ఓడించాలి." ఆవేశంగా అన్నాడు అహ్మద్‌ఖాన్.

తమ్ముణ్ణి సమర్థించాడు ఫిరోజ్‌షా. గిసు దరాజు వాళ్ళ మాటల్ని శ్రద్ధగా వింటున్నాడు. అంతవరకూ పైకి ఏమీ అనలేదు. తమింత ఆవేశంగా మాట్లాడుతూ వుంటే గిసుదరాజు మౌనం అహ్మద్‌ఖాన్ని అసహనానికి గురిచేసింది. పైకి అది కనబడనీయకుండా గిసుదరాజునే ప్రశ్నించాడు.

"మౌల్వీ గిసుదరాజ్! విన్నారుగా, దేవరాయల ఆగడాలు! మీరేంటారు?"

"ఆవేశం వద్దు అహ్మద్! ముందు జాగ్రత్తగా సైన్యాన్ని అప్రమత్తం చేయండి చాలు. మొన్నమొన్న రాయచూరు ఒడంబడిక చేసుకున్న దేవరాయలు మరలా యుద్ధానికి వస్తున్నాడంటే నాకెందుకో నమ్మ శక్యంగా లేదు. యుద్ధమంటే మాటలా? దాని ప్రయత్నాలకీ చాలా సమయమూ, ధనమూ కావాలి. అతను యుద్ధానికి తగు ఏర్పాట్లు చేసుకుంటున్నాడంటే ఆశ్చర్యం కలుగుతోంది. అయినా ఈ వేగు చెప్పిందీ తీసిపారేయలేం. రాచ కుతంత్రాలూ, ఎత్తుగడలూ మామూలు ప్రజలకేం అర్థమవుతాయి చెప్పు? మన జాగ్రత్తలో మనం ఉందాం? చేసేదేమీ లేదు. దేవరాయల్ని ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండడమే మనకున్న కర్తవ్యం. కానీ ఒకటే బాధగా ఉంది. నిన్నటి యుద్ధం తాలూకు గాయాలు ఇంకా పచ్చిగానే ఉన్నాయి. అమాయక ప్రజలకి శాంతి దొరకదా? అనిపిస్తోంది." గిసుదరాజు మెల్లగా అన్నాడు.

"మౌల్వీ చెప్పిందీ నిజమే! అయినా మనంతట మనం ఆవేశపడద్దు. దేవరాయలు మాత్రం యుద్ధానికొస్తే ఈసారి గట్టిగా బుద్ధి చెబుదాం." ఫిరోజ్‌షా అన్నాడు.

"మీ ఇద్దరికీ నాదొక్కటే సలహా! మనంతటమనం ఎవరిమీదా యుద్ధం ప్రకటించవద్దు. దేవరాయలు తనంతటతానుగా యుద్ధం ప్రకటిస్తే ఎదుర్కుందాం తప్ప, మనం ఎవరినీ రెచ్చగొట్టే ప్రయత్నం మాత్రం చెయ్యొద్దు. మీ అన్నదమ్ములిద్దరికి ప్రజల్ని కాపాడవలసిన బాధ్యతుంది." అంటూ గిసుదరాజు ఎప్పటిలాగే హెచ్చరించాడు.

కొంతసేపు మరిన్ని వివరాలు అడిగి తెలుసుకొని మసూమ్ని వెనక్కి పంపించేసాడు అహ్మద్‌ఖాన్. వెళుతూండగా కొన్ని మొహరీలు అందచేసాడు. దేవరాయల సైన్యం కదలికల్ని గమనించమనీ, ఎప్పటికప్పుడు వార్తలు తనకందించమనీ ఆదేశించాడు.

గిసుదరాజుకీ, ఫిరోజుషాకీ వేచి చూద్దామని అనిపించినా, అహ్మద్‌ఖాన్ మాత్రం మానసికంగా యుద్ధానికి తయారవుతున్నాడు. అతని రాజ్యకాంక్ష వేరు. ఇదే సరైన అవకాశం. సైన్యాన్ని అప్రమత్తం చేయడానికి సన్నాహాలు మొదలు పెట్టాడు. దేవరాయలు కంటే ముందుగా తామే అతన్ని ముట్టడించాలన్న పథకం అతనిది. పైకి ఎవరిదగ్గరా అన్లేదు. ఈ సారి ఎంతో గుట్టుగా తన పథకం అమలు పరిచి ఎలాగైనా అన్నగారి సింహాసనాన్ని తను క్రమించాలనీ నిశ్చయించుకున్నాడు. తనదెప్పుడూ రెండవ స్థానమే! తన తెలివితేటలతోనే రాజ్యాన్ని నెట్టుకొస్తున్నాడు. కానీ పేరు మాత్రం అన్నగారికే దక్కుతోంది. ఈ సారి మాత్రం పకడ్బందీగా అన్ని వ్యవహారాలూ చక్కబెట్టలని నిశ్చయించుకున్నాడు. అంతగా అవసరమయితే అన్నగారిని హతమార్చడానిక్కూడా వెనుకాడ కూడదని అనుకున్నాడు.

అధికారదాహం ముందు బంధుత్వాలూ, రక్తసంబంధాలూ పిపీలకాలు. దానికి ఎదురుగా ఉన్న సింహాసన ధగధగలు తప్ప మరేం కనిపించవు.

0000000000000000

పొద్దున్ననగా వెళ్ళిన మసూం రాత్రిగడిచినా రాకపోయే సరికి కంగారు పడ్డాడు రేవన్న. వసారాలో హరీంద్రా, అతని భార్యా నిద్రపోతున్నారు. నేహాల లోపల గదిలో పడుక్కుంది. కాలుగాలిన పిల్లిలా వీధి గుమ్మం వైపూ తచ్చాడుతూనే ఉన్నాడు రేవన్న. మర్నాడు ఉదయం ఒకసారి ముద్గల్‌ణ వెళ్ళాలన్న నిర్ణయాన్ని నేహాలకి చెప్పాడు. కట్టుబట్టలతో ఉన్నపళాన వచ్చేసారు. ముద్గల్లో పరిస్థితెలా వుందో అక్కడ ప్రజల మధ్య వాతావరణం చల్ల బడిందా అన్నది తెలుసుకొని మర్నాటికల్లా వస్తాననీ చెప్పాడు. హరీంద్రా తమ ఇంటికెళ్ళి ఎలా వుందో చూడమనీ చెప్పాడు. సైనికుల భీభత్సంలో ఇల్లు నాశనమయ్యిందాన్న దిగులుతో ఉన్నాడు హరీంద్ర. రేవన్నా ఒక్కసారి తల్లి తండ్రుల్ని చూసి తను క్షేమంగానే ఉన్నాని చెబుదామనీ, నేహాలకి ఈ గండం గడిచేవరకూ అండగా ఉండాల్సొస్తుందనీ స్వయంగా పరిస్థితి చెబుదామనీ అనుకున్నాడు.

ఉదయం పనుందని బయటకి వెళ్ళేటప్పుడు తను మర్నాడు ముద్గల్ వెళదామనుకున్నట్లుగా కూడా చెప్పాడు. ఇంత రాత్రి వరకూ రాకపోయే సరికి అనుమానం పెరిగింది. అతనుకానీ ఏదైనా ప్రమాదంలో చిక్కుకున్నాడా? తమ సంగతి తెలిసి అతన్ని దేవరాయల సైనికులు బంధించారా? మనసు పరిపరి విధాల పోతోంది. అతనికోసం ఎదురు చూస్తూ వీధరుగు మీదే చతికిలబడ్డాడు రేవన్న. ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు ఓ రాత్రి వేళ ఎవరో కుదిపితే ఉలిక్కిపడి లేచాడు. ఎదురుగా మసూం!

"ఏంటి తలుపులు బార్లా తీసి ఇక్కడే పడుకున్నావు?" మసూం చికాగ్గా అన్నాడు.

"నీకోసం ఎదురుచూస్తూ ఇక్కడే చతికిలపడిపోయాను. ఎప్పుడు కునుకు పట్టిందో తెలీదు. ఇంతసేపూ ఎక్కడికెళ్ళావు?" కళ్ళు నులుపుకుంటూ అన్నాడు రేవన్న.

మసూం పనిమీద వేరే వూరెళ్ళానని చెప్పాడు తప్ప ఎక్కడికెళ్ళిందీ చెప్పలేదు. మర్నాడు ఉదయం తను ముద్గల్ వెళుతున్నట్లుగా చెప్పాడు.

"ఒక్కసారి ఊరెళ్ళి వస్తాను. నే వచ్చే వరకూ వీళ్ళని జాగ్రత్తగా చూసుకో! మరలా ఎల్లుండికల్లా వచ్చేస్తాను. నువ్వు కాస్త..." అనంటూండగానే రేవన్న మాటలకి అడ్డు తగిలాడు మసూం.

"నువ్వేం దిగులుపడకు. చెల్లెమ్మనీ, ఈ పెద్దవాళ్ళనీ నేను చూసుకుంటాలే! ముద్గల్ వెళుతున్నావు. కాస్త జాగ్రత్త. సైనికుల కంట పడకుండా చూసుకో. కావల్సివస్తే నా గుర్రం తీసుకెళ్ళు."

"వద్దు. గుర్రమ్మీద వెళితే జనాలు గుర్తుపట్టచ్చు. భయం లేదు. నేను జాగ్రత్తగానే వెళ్ళొస్తాను. ఇంతకీ ఈ పూట ఏమైనా తిన్నావా?" అవునన్నట్లు జవాబిచ్చాడు మసూం.

మర్నాడు ఉదయమే లేచి ముద్గల్ ప్రయాణమయ్యాడు రేవన్న. నేహలా, హరీంద్రా ఎన్నో జాగ్రత్తలు చెప్పారు.

నేహలకీ, వాళ్ళకీ బయటకు రావద్దనీ, ఎవరికంటా పడొద్దనీ వాళ్ళకి చెప్పి ముద్గల్ ప్రయాణమయ్యాడు రేవన్న. చీకటి పడే వేళకి ముద్గల్ చేరుకున్నాడు. సరాసరి ముందుగా తనింటికెళ్ళి తల్లి తండ్రుల్ని చూసి వివరమంతా చెప్పాడు. నేహల గురించీ ఎవరికీ చెప్పొద్దనీ చెప్పాడు. ముద్గల్లో ఇంకా నరేంద్రగజపతి నియమించిన సైనికులున్నారనీ, వాళ్ళు నేహలా వాళ్ళింటి వద్ద కాపలా కాస్తున్నారనీ రేవన్న తల్లి చెప్పింది. శంభుడి తల్లి తండ్రుల్ని సైనికులు చిత్రవధచేసారనీ, అతన్నీ నానా హింసా పెట్టారనీ చెప్పారు. శంభుడింటికెళ్ళి చూసొస్తానని రేవన్న అంటే రేవన్న తండ్రి వద్దని వారించాడు.

"ఊరంతా భయంతో కొట్టుకుపోతోంది. అందరూ ప్రాణాలు అరచేతుల్లో పట్టుకొని మసులుకుంటున్నారు. ఏం జరుగుతుందో ఎవరికీ అర్థం కావడం లేదు. ఒకరినొకరు పలకరించుకునే అవకాశం లేకుండా భయపడిపోతున్నారు. ముద్గల్ మొత్తం అస్తవ్యస్తంగా తయారయ్యింది. దీనిక్కారణం వేదరాయశర్మేనని అందరూ ఆయన్ని తిట్టిపోసుకుంటున్నారు."

"ఇంతకీ గురువుగారు విజయనగరం నుండి వచ్చారా?" రేవన్న ప్రశ్నకి రాలేదని జవాబిచ్చాడు తండ్రి.

కాస్త చీకటిపడ్డాక ఎవరికంటా పడకుండా రేవన్న నేహల ఉండే వీధివైపుగా వెళ్ళాడు. బయట సైనికులు కాపలాకాస్తూ కనిపించారు. ఆ పరిసరాలకి వెళ్ళడం శ్రేయస్కరం కాదని వెనుతిరిగాడు. అక్కడనుండి సరాసరి శంభుడింటికి వెళ్ళి అతన్నీ పలకరించాడు. జరిగినదంతా పూస గుచ్చినట్లు చెప్పాడు శంభుడు. నరేంద్రగజపతి దాష్టీకాన్ని చెబుతూ రోదించాడు. వేదరాయశర్మ వచ్చేవరకూ ఏం జరుగుతుందో చెప్పలేరనీ, తన నుండి ఏం సహాయం కావాలన్నా చేస్తాననీ చెప్పాడు.

ఆ రాత్రంతా శంభుడి ఇంటి వద్దే గడిపాడు రేవన్న. ఒక్కసారి అశ్వత్థ నారాయణ స్వామి గుడి వెళ్ళాలనిపించింది. కానీ ఎవరికంటబడితే ఏం జరుగుతుందోనన్న మీమాంసతో గిపోయాడు. నేహల స్నేహితురాలు ప్రభని కలుద్దామని అనుకున్నాడు కానీ అదీ విరమించుకున్నాడు. ఎలా వుండే ముద్గల్లు ఇలా అయిపోయిందాన్న బాధపడ్డాడు. ఇక్కడ పరిస్థితులు చక్కబడేవరకూ రావద్దనీ రేవన్న తండ్రి హెచ్చరించాడు. తమ గురించి దిగులు చెందనవసరం లేదనీ, నేహలనీ, హరీంద్రనీ ఈ గందరగోళం సర్దుమణిగేవరకూ వారికి అండగా ఉండమనీ చెప్పి పంపాడు. మర్నాడు తెల్లవారుఝామునే రాయచూరు తిరుగు ప్రయాణం కట్టాడు రేవన్న.

0000000000

రేవన్న ఇలా ఉదయం వెళ్ళాడు, అదేనాడు సాయంకాలానికి వేదరాయశర్మ ముద్గల్ తిరిగొచ్చాడు. ఎప్పుడూ జనసంచారంతో కళకళలాడే గ్రామ వీధులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. ఇంటికిరాగానే జరిగినదంతా భార్య పూస గుచ్చినట్లు చెప్పింది. నరేంద్ర

గజపతి చేసిన దౌర్జన్యానికి ప్రజలు ఎంత హడలిపోయారో వివరించింది. నేహల వాళ్ళూ గ్రామం విడిచి ప్రాణ భయంతో పారిపోయారనీ చెప్పింది. శంభుణ్ణీ, అతని తల్లి తండ్రుల్నీ క్రూరాతి క్రూరంగా కొట్టి హింసించారనీ చెప్పింది. ఇదంతా విని వేదరాయశర్మ హుతాశుడయ్యాడు. నోట మాట రాలేదు. దీనికంతటికీ కారణం తనేనన్న భావన అతని మనసుని దొలచడం మొదలు పెట్టింది.

"దీనికంతటికీ కారణం నేనే! అనవసరంగా నేహల గురించి మహారాజుకి చెప్పి ఆయన్ని ప్రేరేపించాను. ఏదో నేహల మహారాణవుతుందని ఆశపడ్డాను కానీ, ఇలా జరుగుతుందనీ ఊహించలేదు. అది తెలిస్తే ఇంతవరకూ రానిచ్చే వాణ్ణే కాదు. నా మూర్ఖత్వం వల్లే ఇలా జరిగింది." అంటూ రోదించాడు.

"మీరు చెబితే ఆ మాహారాజుకేం పోయేకాలం వచ్చింది? నరేంద్రగజపతిని పంపి ఇంత దౌర్జన్యం చేయిస్తాడా? ఆడా, మగా అన్న తేడాలేకుండా అందర్నీ హింసించారు. పిల్లలయితే భయపడి బిక్కచచ్చిపోయారు." వేదరాయశర్మ భార్య బాధగా అంది.

"మహారాజు నేహల్ని మాత్రమే తీసుకురమ్మన్నాడు. ఇదంతా నరేంద్రగజపతి నిర్వాకం. మహారాజుతో అన్నీ అబధ్ధాలు చెప్పాడు. తనపై కొంతమంది యువకులు దాడిచేస్తే గత్యంతరం లేక ఎదురుతిరిగాననీ చెప్పాడు తప్ప ఇక్కడ అతను సృష్టించిన ఘోరాన్ని చెప్పలేదు. మహారాజుకీ నేహల కాదనేసరికి అభిమానం అడ్డొచ్చింది. తననే ధిక్కరిస్తోందాన్న అహంకారంతో బంధించి పట్టుకురమ్మన్నాడు. ఏమిటో ఇదంతా ఎందుకిలా జరిగిందో అర్థం కావడం లేదు. నా వల్లే ముద్గల్ గ్రామానికీ దుస్థితి దాపురించింది." అంటూ వాపోయాడు.

మర్నాడు ఉదయమే వెళ్ళి సైనికుల్ని విజయనగరం వెనక్కి పంపించేస్తాననీ చెప్పాడు. పొద్దున్నే లేవగానే చేసిన మొదటి పని అదే! సరాసరి నేహలా వాళ్ళింటికెళ్ళి అక్కడున్న సైంకాధికారికి విజయనగరం వెనక్కి వెళ్ళమని చెప్పాడు.

"మహారాజు మాకు ఎటువంటి ఆదేశ పత్రమూ పంపలేదు. కనీసం మమ్మల్నిక్కడ నియమించిన నరేంద్రగజపతుల వారూ ఏ లేఖా పంపలేదు. వారి మాటలు ధిక్కరించి మేము ఈ గ్రామం వదిలే ప్రసక్తే లేదు." అంటూ అధికారి తన తిరస్కారాన్ని చెప్పాడు. మాటలు విని అసక్తుడిలా నిస్సహాయంగా వెనుదిరిగాడు వేదరాయశర్మ.

మహారాజు వద్దకి వెళ్ళి జరిగినదంతా చెప్పి సైన్యాన్ని వెనక్కి పిలిపించమని చెప్పడానికి తన శిష్యులకి కబురంపాడు.

కబురయితే అందిందికానీ, ఏ ఒక్కరూ రాలేదు. ఇన్నాళ్ళూ యావత్తు ముద్గల్ గ్రామానికీ వేదరాయశర్మ వాక్కు వేదంలా నడిచేది. ప్రస్తుతం ఆ వాక్కుని పట్టించుకునే వాళ్ళే లేరు. ఒక్క నెలలోనే ఎంత మార్పు?

000000000000000

ఆనాడు మధ్యాహ్నం శంభుడింటికి పరామర్శకెళ్ళాడు వేదరాయ శర్మ. గురువుని చూసి ఒక్క మాటకూడా మాట్లాడ లేదు శంభుడు. అతనికి గురువుగారి మొహం చూడడానిక్కూడా అతనికి మనస్కరించలేదు. శంభుడి తల్లి తండ్రులు సైనికుల దెబ్బకి అనారోగ్యంతో మంచం పట్టారు.

వాళ్ళు తమపై సైనికులు చేసిన దుర్మార్గాన్ని వేదరాయశర్మకి పూస గుచ్చినట్లు చెప్పారు. ఇదంతా తనవల్లే జరిగిందనీ పశ్చాత్తాపం ప్రకటించాడు వేదరాయశర్మ. ఇందులో తన వంతుకూడా ఉందని లోలోపల అనుకున్నా పైకి మాత్రం మౌనంగానే ఉండిపోయాడు శంభుడు.

నరేంద్రగజపతి చేసిన దౌర్జన్యానికి కారకుడు దేవరాయలు కాదని ఎంత చెప్పినా నమ్మ లేదు శంభుడు. పైకి మంచిగా కనిపించే మహారాజు వెనుక చాలా క్రూరుడనీ, యన ప్రమేయం లేకుండా నరేంద్రగజపతి అంతగా రెచ్చిపోడనీ వాదించాడు. మహారాజుకి నిజంగా ప్రమేయం లేకపోతే ముద్గల్లో ఇంకా ఈ సైనికుల్ని వెనక్కి ఎందుకు పిలవలేదని ఎదురుదాడికి దిగాడు. గురువుగారినీ నానామాటలతో

దూషించాడు. గురువుగారి ముందు సమాధానం చెప్పడానికే భయపడే శంభుడు అలా మాట్లాడ్డం చూసి హుతాశుడయ్యాడు వేదరాయశర్మ. కొంతసేపయ్యాక అక్కడినుండి నిష్క్రమించాడు.

ఎలాగయినా ఈ సైనికుల్ని ముద్గల్ నుండి పంపించేయాలనీ నిర్ణయించుకున్నాడు వేదరాయశర్మ. మహారాజుకి ఇక్కడ జరిగినదంతా చెప్పి నేహలని ఎలాగయినా కాపాడమని ప్రాధేయపడడానికి తిరిగి విజయనగర ప్రయాణానికి సిద్ధమయ్యాడు. శిష్యులెవరూ తన తరపున మహారాజుని కలవడానికి సుముఖంగా లేరు. ఓపికున్నా లేకపోయినా ఇది తప్పని పరిస్థితి. ముద్గల్ణ గ్రామంలో జనజీవనం సర్దే బాధ్యత తనమీదే ఉందని భావించి విజయనగరం వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు.

ఎప్పుడు విజయనగరం వెళ్ళినా శిష్యుల తోడుగా వెళ్ళే వేదరాయశర్మ ఈ సారి ఒంటరిగా బయల్దేరాడు. భార్య కూడా వస్తానని బ్రతిమాలినా వద్దని వారించాడు. ఒక గుర్రబ్బండిని బాడుగకి తీసుకొని మర్నాడు ఉదయమే బయల్దేరాడు.

ఊరు పొలిమేరలు దాటగానే ఎవరో కొంతమంది దుండగులు వేదరాయశర్మ బండిని అడ్డుకున్నారు. వాళ్ళ ముఖాలకి ముసుగులు ఉన్నాయి. ఎవర్నీ గుర్తుపట్టడానిక్కూడా లేకుండా ముసుగులున్నాయి. తను ఒక ముఖ్యమైన పని మీద విజయనగరం వెళుతున్నాననీ, తన వద్దున్న ధనాన్ని ఇచ్చి తనని విడిచేయమని ప్రార్థించాడు వేదరాయశర్మ. వాళ్ళెవరూ  పలుకులు విన లేదు. బండివాణ్ణి చితక బాదితే వాడు పారిపోయాడు.

వేదరాయశర్మనీ కొట్టడం మొదలు పెట్టారు. వయసు పైబడి ముసలితనం వల్ల ఏమాత్రం ప్రతిఘటించలేదు వేదరాయశర్మ. వాళ్ళు కొట్టె దెబ్బలకి గట్టిగా అరిచాడు. ఇంతలో వారిలో ఒకతను కత్తి తీసుకొచ్చి ఒక్క ఉదుటున వేదరాయశర్మ కడుపులో పొడిచాడు. అంతే రక్తం బయటకి చిందింది. గట్టిగా అరుస్తూ నేల కూలాడు వేదరాయశర్మ. కొన ఊపిరితో ఉండగా తనని పొడిచిన వ్యక్తి కళ్ళల్లోకి చూసాడు.  కళ్ళని గుర్తుపట్టి "నువ్వా?" అని అనేలోపలే మరోసారి పొడిచాడా వ్యక్తి.  ఇంకా ఏదో అందామని ప్రయత్నిస్తూనే తల వాల్చేసాడు వేదరాయశర్మ.  ఆ వ్యక్తి తన ముసుగుని తొలగించాడు. ప్రతీకాల జ్వాల చల్లారినట్లు అతని కళ్ళు శాంతించాయి.

"ముద్గల్కి పట్టిన పీడ వదిలిపోయింది." అంటూ గట్టిగా అరిచాడతను. మిగతా అతని అనుయాయిలూ  ఆనందంతో ఎగిరారు.

"ఎవరైనా చూస్తే మంచిది కాదు. పద పారిపోదాం! " అంటూ  గుంపులో ఒక వ్యక్తి తొందరపెట్టాడు.

వాళ్ళందరూ వేదరాశర్మ చనిపోయాడని నిర్ధారించుకొని అక్కడనుండి పలాయనం చేసారు.

0000000000000000000000000000

వేదరాయ శర్మని ఎవరో హత్యచేసారన్న వార్త ముద్గల్ గ్రామమంతా దావానలంలా వ్యాపించింది. ప్రజల్ని భయపెట్టాలని సైనికుల ద్వారా నరేంద్ర గజపతే ఈ పని చేయించాడనీ అందరూ అనుకున్నారు. ముద్గల్ గ్రామంలో ప్రజలు ఒక్కసారి భయకంపితులయ్యారు.

యావత్తు గ్రామానికీ మకుటాయమానంగా నిలిచిన వేదరాయశర్మ అర్థాంతర నిష్క్రమణ ముద్గల్ ఇంకా జీర్ణించుకోలేకపోతోంది. ఒక్కోసారి మన చేతలే తల రాతలుగా మారుతాయి. వేదరాయశర్మే దానికి పెద్ద ఉదాహరణ.

0000000000000000000000000

(కొనసాగింపు వచ్చేసంచికలో)

POST YOUR COMMENTS